వేస్ అండ్ టు ఐ లవ్‌యూ....

హుషారుగా ఇంగ్లీషు ట్యూను హమ్ చేస్తూ పరుగెత్తే శివానందం వురఫ్ ఎమ్. ఎస్ నేందా లేదా ఆనంద్ తాలూకు కాళ్ళు 'అసంకల్ప ప్రతీకార చర్య'కు ఉదాహరణలాగ స్థంభించి పోయాయి. వాళ్ళ నాన్నగారి పాద రక్షలు గుమ్మంలో కన్పించగానే. హత్యా ప్రదేశంలో విలన్‌లాగ. 'నాగార్జున సాగర్ డామ్' పూర్తవు తున్నంత మెల్లిగా అడుగులో అడుగు వేసుకొంటూ హాల్లోకి వచ్చాడు. బామ్మ చాపమీద కూర్చొని భగవద్గీత చదువు కుంటోంది. "బామ్మా! నాన్న ఇంట్లో లేరా?" మెల్లిగా అడిగాడు. కళ్ళజోడు సరిచేసుకొని. తల పైకెత్తి "ఏరా! నీకిప్పుడు కన్పించిందా ఇల్లు? ప్రొద్దు పొడవకుండా పోయినవాడివి, రాత్రి పది గంటలకా రావడం? మీ నాన్న ఇప్పటివరకూ నీకోసమే చూసి బెజ వాడ వెళ్ళాడు, ఏదో పనుందంటూ. వాడుండాల్సి...." అని ఆవిడ ఇంకా ఏదో అంటూండగానే "కట్, బామ్మా! కట్! ఇవాళ కాలేజిలో జీతం కట్టా లన్నారు హఠాత్తుగా. నాన్న గురించి

---

రెండవ బహుమతి రూ. 25

**ఉండమాటి తాతాజి,**

[బి. ఎ. (హెచ్. పి. ఎస్.) సెకండి యర్ గవర్నమెంటు ఆర్ట్సు కాలేజి, రాజమండ్రి.]

# "నిజమైన అబద్ధం"

షాప్‌కి ఫోన్ చేస్తే లేదన్నారు. అప్పుడు వెంటనే సైకిలు తాకట్టు పెట్టి ఓ వంద రూపాయలు పుచ్చుకొని కట్టే శాను. ఏం చెయ్యను బామ్మా! నాన్నకు చెప్పినా తెలీదు నా అవస రాలు. ఏదో శ్రద్ధగా చదువుదామంటే ఇదీ వరస! మా కాలేజికి షిఫ్టు ఒకటి తగలడిందిగా? ప్రొద్దుట కాలేజీ. సాయంత్రం ఎన్. సి. సి. చావనా! మీకేం చెప్పినా తెలీదు." బుంగమూతి పెట్టాడు బుజ్జి శివానంద్, నాన్న ఇంట్లో లేడనేసరికి, ఆ హుషారులో ఓ చిన్న సైజ్ ఉపన్యాసం దంచేసి. "ఒక టడి గితే వంద చెప్తావు. ఇలా ఎన్ని వందలు తగలెట్టావో! అయినా, ఇలా మాటిమాటికీ సైకిలు తాకట్టు పెట్టటు మేమిట్రా పరువుతక్కువ పని? చదువుకోసమని అడిగితే నేనివ్వనూ?" అంటూ లేచిందా అమాయక బామ్మలా ప్రతినిధి. "బామ్మా! దేశంలో నీలాంటి బామ్మలో వందమందుంటే ఎంత బాగుపడిపోను ప్రజలు!" ఆవిడ తెచ్చిచ్చిన నోట్లు లెక్కపెట్టుకుంటూ ఓ కాంప్లిమెంటు పారేసి బయటకు పారిపోయాడు. "భోంచేసి వెళ్ళరా!" అన్న బామ్మ మాట వినకుండా. "ఎంత శ్రద్ధో చదువంటే! పిచ్చి

సన్యాసి!" అంటూ తృప్తిగా నవ్వు కొందావిడ.

"కాయా? పండా?" ఆత్రుతగా అడిగాడు. వీధి చివర అప్పులాడిలా కాసిన మిత్రుడు సుబ్బారావు. "ఒరేయ్! మనం ప్లాన్ వెయ్యడం, అది జరక్కపోవడమూనా!" కాలర్ సర్దుకుంటూ నంబియార్ నవ్వొకటి పారేశాడు శివానంద్. "ఒరేయ్, ఒరేయ్! నవ్వి భయపెట్టకు. మీ బామ్మ భోళా మనిషి కనక నీ సైకిల్ నా రూమ్‌లో పెట్టి, తాకట్టుపెట్టేసి ఫీజు కట్టానంటే నమ్మేసి దబ్బిస్తోంది. అదే మీ నాన్న దగ్గర తీసుకో చూద్దాం!" ఛాలెంజ్ చేశాడు సుబ్రావ్. "మై డియర్ సుబ్రావ్! ఈ డబ్బుగల శుభసమయంలో ఫాదర్స్ ప్రసక్తెందుకు? నడు. లెటజ్ ఎంజాయ్!" చిద్విలాసంతో సమాధానం. రిక్షా ఎక్కారిద్దరూ.

ఓ పది రోజులు తరవాత మళ్ళా అదే దృశ్యం తెలుగు సినిమా జానపద కథలాగ. బి. ఎస్‌సి. విజయావాళ్లా బోటనీ టూర్‌కి వెళ్తున్నారు. ఎలా గయినా, సుబ్రావ్‌గాడికి తెలియకుండా వాళ్ళతో టూర్‌కి వెళ్ళాలనే సదుద్దేశంతో ఇంట్లో ప్రవేశించిన ఆనంద్ "బామ్మా! ఎగ్జామినేషన్ ఫీజు కట్ట



టాని కివాళే ఆఖరు రోజు. అంచేత సైకిల్ తాకట్టు....” డైలాగులు మర్చిపోయిన నటుడిలాగు నసుగుతున్నాడు, ఒకప్రక్క నేరోకట్ పాంట్ తో చాప మీద కూర్చోవడానికి నానా అవస్థా పడుతూ. “నీ కిదేం పోయేకాలంరా! సైకిలు తాకట్టు పెట్టటమేమిటి ఖర్మం! (సైకిలు తాకట్టు పెట్టే ఖర్మం నాకేమిటి బాబ్బా! అది శుభ్రంగా సుబ్రావ్ రూమ్‌లో పడుకొంటేనూ - ఆనంద్ స్వగతం) ఇదప్పుడే ఆరోసారి! కాలేజీకి కట్టాలంటే నేనిస్తానన్నాగా! వంద రూపాయల భాగ్యానికి ఈ అప్రదిష్టపు పనులు చెయ్యాలా? ఇంకెప్పుడూ ఇలాంటి పనులు చెయ్యనంటే ఇస్తాను” అందావిడ లేస్తూ. “నీకేం చెప్తావు ఆఖరు రోజంటే నే నేం చెయ్యను? అంత దూరంనుంచి సైకిలుమీద రానా? స్కూటర్ కొనమంటే నాన్న కొనడు. అవసరమై ఏదో బాధలు పడి నేనిలా చేస్తే....” వాళ్ళ నాన్న గదిలోకి రావడం చూడకపోతే శివానందుల ఉపన్యాసానికి అంతముండేనో, లేదో చెప్పడం కష్టం.

“నువ్వేమీ కష్టపడి కట్టనక్కరలేదు. నడు. సైకిలు ఎక్కడ తాకట్టు పెట్టావో చూపించు. వాడికి నేనిస్తాను. ఇకముందు నీకూ, వాడికీ ఆ అవసరం లేకుండా చూస్తాను” అంటూ బయటకు నడిచారాయన. మొరార్జీ గోల్డు కంట్రోల్ అంత దారుణంగా దెబ్బ తినేసింది శివానంద్ ప్లాన్. ధైర్యం దిగజారిపోయింది. వెనకనే పిల్లిలాగా అనుసరించాడు.

కారు సుబ్బారావు రూమ్ ముందు ఆగింది. ఇద్దరూ కారు దిగి ఒక రూమ్‌లోకి ప్రవేశించారు. “ఇక్కడే కూర్చో నాన్నా! లోపలికి వెళ్ళి అతనిని తీసుకువస్తాను” అంటూ కుర్చీవేసి లోపలికి వెళ్ళాడు శివానంద్. సుబ్రావ్ ఎక్కడా కనిపించలేదు. ధైర్యం సన్నగిల్లింది. సుబ్రావ్ రూమ్-మేట్ భాస్కర్ టాయ్‌లెట్ అవుతున్నాడు. చివరి రూమ్‌లో. “ఏరా! సుబ్బారావ్ ఎక్కడికి వెళ్ళాడు?” అన్నాడు ఆత్రుతగా ఆనంద్.

“ఈపాటికి బెజవాడ వెళ్ళుంటాడు” అన్నాడు భాస్కర్ తాపీగా.

“అదేమిటి?” అన్నా డాశ్చర్యంగా శివానంద్.

“నీకు తెలీదా? విజయా వాళ్ళ క్లాస్ టూర్ కి వెళ్ళారుగా! అందుకని నీ సైకిలు ఓ మార్వాడీ దగ్గర తాకట్టు పెట్టి, వాళ్ళతో చెక్కేశాడు. ఐదు రూపాయలు అప్పుచ్చుకొని నేను సినిమాకి వెళ్తున్నా....” తను ప్రేమిస్తున్న అమ్మాయి ఉన్నట్టుండి బ్రదర్ అని పిలిచేసినట్టూ, కరెంట్ కోతవలన సినిమా హాల్స్ మూసేసినట్టూ, కాపీ చేస్తూంటే ఎగ్జామినర్ పట్టుకున్నట్టూ, కళ్ళు తిరుగుతున్నట్టూ అనిపించింది శివానంద్‌కి. ఆ తరవాత ఇంకేం వినిపించలేదతనికి. అందుక్కారణం, అతనికి చెవుడూ, పరాకుగా వినే గుణం వుండటం మాత్రం కాదు.

***